


# అంటరాని గుణం

— కలవకూరి సూర్యకళారెడ్డి

'శుక్లాం బరదరం... విష్ణుం... శశి వర్ణం... చతుర్భుజం...'

శ్రావ్యమైన గొంతుక!

రాఘవరావుకి ఆ కంఠం ఎవరిదో అర్థమయింది. అది శాంతమూర్తి, నెమ్మదస్తురాలు, తొణకని కుండ-అయిన ఆముక్త మాల్యద!

ఎన్నిసంవత్సరాల తరువాత వింటున్న కంఠమది!

ఎంతమార్దవము. ఎంత సున్నితత్వం కూడుకున్న గొంతది!

ఆముక్త... ఆముక్త...

రాఘవ రావు పెదాలు ఆ పేరును పదే పదే వుచ్ఛరించాయి. అతని మేను విపరీతమయిన పుత్రికా వాత్సల్యంతో కంపించింది.

సరిగ్గా పది సంవత్సరాల తరువాత ఆమెను చూడాలన్పించింది. అందుకే ఆమెను వెతుక్కొంటూ వచ్చాడు.

ముచ్చటయిన చక్కని యిల్లు. పేరు 'ప్రశాంతి నిలయం!' ప్రపంచంలోని ప్రశాంతతంతా ఒక్కుమ్మడిగా ప్రోవు పోసినట్లుంది.

ఇన్ని రోజుల తరువాత... యింత దూరం-తన కుమార్తెను వెతుక్కొంటూ వచ్చినా... ఎందుకో గేటు తలుపు చొరవగా తీసికొని లోనికి పోయేందుకు సంశయించాడు రాఘవరావు.

ఆ ప్రశాంతి నిలయంలోకి అడుగు వేసేందుకు తాను అర్హుడేనా...? ఆ అర్హతను తాను పది సంవత్సరాల నాడే కోల్పోయాడా... లేక... యింకా పొంది యున్నాడా...?! ఎడ తెగని ఆలోచనలు రాఘవరావుని వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

గేటు మీద గాక మాను మీదకి అల్లబడిన బోగన్ విల్లా పూలు!

తెరచిన కిటికీల్లోంచి కన్పిస్తూన్న పలుచని రంగు రంగుల కర్టెన్లు.

కాంపవుండ్ వాల్ గేటు దగ్గర నుండి యింటి గుమ్మం వరకు వేయబడిన సన్నని ప్లాట్‌ఫారమ్. దానికి యిరువైపులా రాజుల్లా ఠీవిగా నిలబడి గాలికి చిన్నగా వూగుతూ... లోనికి ఆహ్వానం పలుకుతున్న క్రోటన్ చెట్లు.

గేటు పట్టుకొని ఆగిపోయిన రాఘవరావు చేతుల మీద పడిన లేత చేతుల తాలూకు ఆకృతిని ఆపాద మస్తకంగా చూశాడు.పంచకట్టుకుని..నుదుట భగవంతుని కుంకుమ పెట్టుకుని నెరసిన జుట్టు. ఎదిగిన గడ్డంతో, చేతి సంచితో గేటు మీద వాలిన ఆ అరవై యేండ్ల వ్యక్తిని చూసిన ఆ తొమ్మిదేండ్ల పాప ఆప్యాయంగా అతని చేతిని పట్టుకొని 'ఎవరు కావాలి తాతగారూ!' అంది

'ఆముక్త మాల్యద... చిన్నగా గొణిగాడు.

'ఆమె మా అమ్మే తాతగారూ! రండి లోనికెళదాం" చేయి పట్టుకొని లోనికి తీసికెళ్ళింది.

పూజగదినుండి వినపడుతూన్న భగవన్నామ స్మరణ ఆగిపోయింది. తలంటుకొని కట్టబడిన జారుముడి. నుదుట కుంకుమ; పాపిటలో కుంకుమ. సంతోషమే సగం బలం అన్న సూక్తిని రుజువు చేస్తూ-రాఘవరావు కనులకి చాలా నిండుగా కన్పించింది.

దీర్ఘకాలం తర్వాత తండ్రిని చూసిన ఆముక్త కనులు గడియ కాలములో నీటిలో నిండిపోయాయి.

'నాన్నా' పరుగున వెళ్ళి అతడి కాళ్ళ మీద పడింది.

"నన్ను క్షమించు నాన్నా!"

వాస్తవానికి-తాను కుమార్తెను క్షమించాలో లేక కుమార్తే తనను క్షమించాలో అర్థం గాక అయోమయంలో అలానే నిలుచుండి పోయాడు.

బయట కాళ్ళుకడుక్కొని అప్పుడే లోనికొచ్చిన అరుణ్ మామగారిని గుర్తు పట్టలేక పోయాడు.

'అరుణ్! మా ఫాదర్. ఇన్ని రోజులకి-బిడ్డ తప్పును క్షమించి... ఒక్క మారు చూసి పోదామని వచ్చారు'-ఆముక్త.

విషయం అర్థమయిన అరుణ్ ముఖం సంతోషంతో- కూడిన ఆశ్చర్యంతో మిల మిలలాడింది.

'నమస్తే అంకుల్ భక్తితో చేతులు జోడించాడు.

ప్రశాంతంగా, పరిశుభ్రంగా వుండి మృదువుగా భాషిస్తున్న అల్లుడిని చూసి రాఘవరావు మనస్సు

వుప్పొంగింది తృప్తితో.

తాను కాదన్న అరుణ్... తన అల్లుడుగా అర్హత లేదని తూలనాడిన అరుణ్... తనినింత మర్యాదతో మన్నించడమా?!

గతంలో జారిన రాఘవరావు మనస్సు విలవిల లాడింది.

ఒక్క క్షణం గతాన్ని గట్టిగా తొక్కి పట్టాడు.

స్నానం చేసి పడక్కుర్చీలో కూర్చొని కళ్ళద్దాలు సవరించుకొన్నాడు దిన పత్రిక తీసుకొని చదివేందుకు-కనులు పేపరులోకి చూస్తూన్నా మనస్సు మాత్రం పదేండ్ల వెనక్కి వెళ్ళింది.

•••

యం.ఎస్సీ. కెమిస్ట్రీ ఫస్టు క్లాసులో పాసయిన ఆముక్తను అభినందించిన రాఘవరావుకి-విన కూడని నిజాన్ని విన్నవించుకొంది ఆముక్త మాల్యద

'నాన్నా! జన్మనిచ్చిన మీరు మాకు దారి చూపుతారని తెలిసీ... నేనే... నా జీవన దారిని వెతుక్కున్నాను. పెద్దరికాన్ని లెక్క చేయని నాది తప్పే అయ్యుండొచ్చుకాని తప్పదు.

"అరుణ్ చాలామంచివాడు. తెలివిగలవాడు ప్రస్తుతం పి.హెచ్.డి. చేస్తున్నాడు.

"కులానికి, ధనానికి రెండింటికీ పేదవాడే. అయినప్పటికి నా మనసు అతడిని కోరుకుంది. అతనితో జీవితాన్ని పంచుకొనేందుకు వువ్విళ్లూరుతోంది.

అందుకే అతనిని వివాహం చేసుకునేందుకు నిశ్చయించుకొన్నాను."

'అతను మన కులంవాడు కాదా...!'

కులం మరువని వ్యవస్థని బాగా జీర్ణం చేసికొన్న రాఘవరావు నోట వెలువడిన మొదటి మాట అది.

'అతనిది అంటరాని కులం. కాని అతడిని నేను నా జంటగా ఎనుకున్నాను."

అప్రతిభుడయ్యాడు. 'ఆముక్తా...' సనాతన, సద్బ్రాహ్మణ వంశంలో పుట్టి సత్ సంప్రదాయాలను బాగా వంటబట్టించుకొన్న రాఘవరావు విషం తిన్నట్లుగా విల విలలాడాడు.

రాఘవరావుకి కులం పట్ల, మతం పట్ల నమ్మకం మెండు. పాతకాలపు వాడయినందున పాతకాలం సామెతలను బాగా జీర్ణించుకొన్నాడు. కయ్యానికయినా, వియ్యానికయినా, నెయ్యానికయినా సమవుజ్జీ తప్పనిసరిగా అవసరమని నమ్మిన వ్యక్తి.

రాఘవరావుకి ఆముక్త, వకుళ ఇద్దరు కుమార్తెలు. పున్నామ నరకంనుండి రక్షించేందుకు కొడుకు పుట్టలేదన్నదే ఎంతో వేదన అతనికి. కూతుర్ల మీద-కనుల నిండా కోటి ఆశలు నింపు కొని బ్రతుకుతూన్న అతనికి యీ నిర్ణయం గొడ్డలివేటులా బాధించింది.

ఆముక్తమాల్యద తర్వాతి కుమార్తె వకుళమాల-అప్పటికి బి.ఎ. చదువుతూంది. వివేక వంతురాలు, విజ్ఞానవంతురాలు అయిన ఆముక్త తీసికొన్న తొందరపాటు నిర్ణయం-అతనికి రుచించలేదు.

రాఘవరావు తన శాయశక్తులా ఆమెకి నచ్చ చెప్పి చూశాడు. ఆమె తల్లి వలవలా ఏడ్చింది. 'నీవు తీసుకున్న నిర్ణయమే ఆఖరుదయితే... నా కూతురు చచ్చిందనుకొంటా' అన్నాడు.

అందుకామె కట్టుబడింది.

కట్టుబట్టలతో బయటకి నడిచింది.

రెండు విభిన్న కులాలను సమన్వయ పరుచుకొని కలసి కలకాలం కాపురం చేయడం... కడు దుర్లభం...! కల్ల... రాఘవరావులోని తండ్రి మనస్సు తల్లడిల్లి పోయింది.

•••

ఆముక్త పచ్చని, తృప్తి కరమయిన కాపురాన్ని చూసి మనస్ఫూర్తిగా ఆనందించాడు రాఘవరావు.

కులాలు వేరన్న చిన్న మచ్చ... చాలా చిన్నదయి... చివరికి రేణువంతయి అదృశ్యమయి పోయింది.

'నేను నీ విషయంలో చాలా పొరబడ్డాను. నీవు ఎంచుకొన్న నీ జీవన మార్గం ముళ్ళబాట అవుతుందేమో... ఆ ఎగుడు దిగుడులకి నీవు తట్టుకొని నిలబడగల శక్తని కోల్పోతావేమోనని భయపడ్డాను. కాని నా అంచనాని తారుమారు చేశావు. నీ జీవితాన్ని సుగమనం చేసు కొన్నావు.

"నీ తల్లి నిన్ను చూడకుండానే నీ దిగులుతోనే కన్నుమూసింది. ఆమె బ్రతికినంత కాలం నిన్ను చూసేందుకు అనుమతించని నేనెంత పాపాత్ముడనో-అందుకామె ఎంత బాధపడిందో నాకిప్పుడర్థమవుతూంది.' గొంతు బొంగురు పోయి జీర ఏర్పడింది. కనుల నిండా నీరూరింది.

మనమడు, మనుమరాలు అతడినల్లుకొన్నారు, 'తాతయ్యా' అంటూ.

వారిని ఆప్యాయంగా తడుముతూ 'మీ పేర్లేమిటర్రా' అని అడిగాడు.

'దేవకి, రాఘవ్' అన్నారు ఒకేసారి.

రాఘవరావుగారి కళ్ళు మిల మిలమెరిశాయి.

'అవును నాన్నగారూ! మిమ్మల్నెంతో అభిమానించి, గౌరవించిన నాకు-మీరు 'నేను కన్పించకూడదన్న ఆంక్ష విధించారు. అందుకే నా తల్లి దండ్రుల పేర్లు, బిడ్డలకి పెట్టుకొని తృప్తి పడుతున్నా'

రాఘవరావుకి ఏడుపు ముంచుకొచ్చింది-కుమార్తె తన యెడల పెంచుకొన్న ప్రేమకి.

అతను మగవాడు కాబట్టి-

వలవలా ఏడ్చే అవకాశం అతనికి లేదుకాబట్టి గుండెను మెలిబెట్టే బాధను పిడికెడు గుండెలోనే దాచేసుకొన్నాడు.

వణికే చేతుతో ఆముక్తకి లక్షరూపాయలకి చెక్కు అందించాడు.

"నా జీవితంలో నే సంపాదించిన యింటిని అమ్మేశాను. అమ్మాలని నేననుకోలేదు. కాని అమ్మక తప్పలేదు. వకుళ పరిస్థితులు బాగాలేవు. అందుకే అమ్మేశాను. నీభాగం లక్షరూపాయలు నీకందించేందుకు వచ్చాను.

"ఇప్పటికే నీకెంతో అన్యాయం చేశాను. కనీసం యిది అంగీకరించయినా నా మనస్సుకి కొంతి వూరట కల్గించు..."

'డాడీ! డబ్బన్నది మనిషిలో ప్రేమను, అభిమానాన్ని కొత్తగా సృష్టించలేదు, కట్టు గుడ్డలతో నీ దగ్గరనుండి నేను వచ్చేసినా...అరుణ్ చేతిలో, నా చేతిలో-దొంగకి సయితం దొరకని గుప్త ధనమయిన విజ్ఞానం వుంది. కేవలం ఆ విజ్ఞానమే సహాయపడి మమ్మల్ని గమ్యానికి చేర్చింది.

"డాడీ! నిర్మలమయిన ప్రేమ ప్రపంచంలో అన్నింటికన్నా చాలా శక్తివంతమయింది.

నా భర్త కులానికి చిన్నయినా-నన్ను అమితంగా ప్రేమించాడు. దేవతల్లే ఆరాధించాడు. నా మనస్సుకి నచ్చిన రీతిలో నన్ను నొప్పించక నడుచుకొన్నాడు.

నేనిక జీవితంలో చూడకూడని నా తలిదండ్రులు అనుక్షణం నాకను సన్నల్లో మెదిలేందుకు-నా బిడ్డలకి ఆపేర్లు అతనే పెట్టాడు.

సనాతన వంశంలోపుట్టిన నా కోసం అతనికి అత్యంత ప్రీతి పాత్రమయిన మాంసం, చేపలను తినడం పూర్తిగా విసర్జించాడు.

కులాలు లేకున్న నేమి
మతాలు మారిన నేమి
ధనం లేకున్న నేమి

మంచి మనస్సున్న, మనస్సుకి నచ్చిన భర్త వుంటే అంతకంటే కావలసిన దేమిటి? నేనీ డబ్బు ఎప్పుడూ ఆశించలేదు. ఇప్పుడూ ఆ డబ్బుతో నాకవసరం లేదు. మీ దగ్గరే వుంచుకోండి నాన్నా...' అతనికి తిరిగియిచ్చేసింది.

•••

వకుళమాల ఇంటి పెరటిలో-బాదం చెట్టుకి కొంత అవతలగా మంచంవేసుకొని పడుకొన్నాడు రాఘవరావు.

ఇంచుమించు రాత్రి పదకొండయింది.

ఇంకా అల్లుడు అరవింద్ వచ్చిన అలికిడి కాలేదని-చెవులు రిక్కించి ఆలకిస్తున్నాడు.

చిన్నతనాన-వకుళ యింటికి చిన్నబిడ్డ అని ఎంత గానో గారాబం చేశాడు. కొంత పెద్దయిన తర్వాత ఆముక్త తనను కాదని ఆమె జీవితాన్ని ఆమే నిర్ణయించుకొన్నదన్న కోపంతో ఆమె యింటి నుండి వెళ్ళిపోయిన తర్వాత-చిన్న కూతురు వకుళ మీద అభిమానాన్ని మరింత రెట్టింపు చేసికొని మరీ చేరువయ్యారు.

అక్కని అమితంగా ప్రేమించిన నాన్న అక్కమీద ఆగ్రహాన్ని పెంచుకోవడానికి గల కారణాన్ని అర్థం చేసికొన్న వకుళ-తండ్రితో చాలా జాగ్రత్తగా తెలివిగా వ్యవహరించేది.

తండ్రిమాట ఆమెకి వేదం!

తండ్రి బాట ఆమె జీవన బాట.

ఓ మంచి ముహూర్తాన, ఓ మంచి కుర్రాడిగా తలచిన యువకుడు-అరవింద్‌కి జాతకాలు చూసి

మరీ-వకుళనిచ్చి వివాహం గావిం చాడు.

పెద్ద కుమార్తె విషయంలో చిత్తుగా ఓడిపోయిన తను కనీసం చిన్న కుమార్తె విషయంలోనయినా సంపూర్ణంగా గెలిచానన్న ఆనందం అతనిలో కొన్నాళ్ళయినా నిలువలేదు.

తను చెమటోడ్చి సంపాదించిన డబ్బుని-తన శక్తికి మించిన వరకట్నంగా అల్లుడి చేతిలో పోశాడు రాఘవరావు.

రాఘవరావు చెమటతో యిప్పటి వరకు తడిసిన డబ్బుకి వెగటు పుట్టి-అరవింద్ దగ్గర బ్రాందిలో తడిసి మత్తెక్కి మరో చేతిలోకి జారిపోయింది.

'వ్యసనం' అన్నది క్యాన్సరు వ్యాధి లాంటిది.

వ్యసనానికి మనిషి బానిస కాకూడదు.

కర్మ కాలి అయినాడో-యిక అతని జీవితం పతనమే. అథోగతే!... అగాధమే!

సరిగ్గా అదే జరిగింది అరవింద్ విషయంలో.

మంచి వంశం.

మంచి సాంప్రదాయం.

మంచి చదువు.

మంచి వుద్యోగం!

అన్నీ కలసి వంచన చేశాయి. ఆనందంగా గడవాల్సిన వకుళమాల దాంపత్య నందనవనంలో గంజాయి వాసనలు వ్యాపించాయి.

పెద్ద శబ్దమయింది.

రాఘవరావు ఆలోచనల నుండి తేరుకొని ఆలకించాడు శబ్దాన్ని.

వకుళమాల సన్నగా ఏడుస్తూ చెపుతూంది భర్తతో-

'నాన్నగారు వచ్చారు. పెరట్లో పడుకొన్నారు. కనీసం ఆయనున్నంత వరకయినా సవ్యంగా వుండండి.'

బాగా తాగిన వాడికి యుక్తా యుక్త జ్ఞాన మెక్కడిది?!

వకుళ బారుజడను అరచేత వడిసి పట్టి లాగి ఒక గుంజు గుంజి గోడకేసి తోశాడు బలంగా.

'చాలు కానీయవే... మీ అబ్బ అయితేనేమి... వాడి అమ్మ మొగుడయితే నాకేమిటే... డబ్బు అడగమన్నా... అడిగావా ముసలాడిని!...' వకుళని వెనక్కి తోసి కర్కశంగా నవ్వాడు.

బాధతో మూల్గింది వకుళ.

రహస్యంగా గమనిస్తూన్న రాఘవరావుకి అసహ్య వేసింది అరవింద్ మీద.

వకుళ యిబ్బందుల్లో వుందని, అప్పుల వాళ్ళు యింటి మీదకి వచ్చి నానా అల్లరి చేస్తున్నారని తెలిసే యిల్లు అమ్మాడు రాఘవరావు.

వకుళ వివాహ సమయంలోనే-అరవింద్‌కి యివ్వాల్సిన కట్నం పైసలతో సహా యిచ్చేశాడు మరి... యింకా డబ్బు అడిగేందుకు అతనికి మనస్సెలా వచ్చిందో... రాఘవరావుకి అర్థం కాలేదు.

స్నానమయినా చేయకుండా మొద్దుగా భోంచేసి లేచిన అరవింద్-'ఏమే యింకా అలానే తగలడ్డావ్. నీవూ... నీ ఏడుపుగొట్టు మొఖమూను. ఇప్పుడు ఎవడు చచ్చాడని ఆ ఏడుపు?! ఎవరూ చావలేదు కాని-పోయి చీర మార్చుకొనిరా...' అన్నాడు సిగరెట్టు ముట్టించుకొని-రింగులు రింగులుగా ఆమె ముఖాన పొగవదులుతూ.

సిగరెట్టువాసన అస్సలు పడదు వకుళకి. పొగ దెబ్బకి వుక్కిరి బిక్కిరి అయి... కనుల్లో నీళ్లొచ్చాయి.

డోకొచ్చినంత పనయింది.

మారు మాట్లాడకుండా పోయి-ఒక్క క్షణంలో మంచి మెత్తటి సిల్కు చీర కట్టుకొని, వదులుగా జడ అల్లుకొని భర్త తెచ్చిన మల్లె మొగ్గలు తురుముకొని, సెంటు అద్దుకొని, బొట్టు కాటుకలు తీర్చి దిద్దుకొని పరిగెత్తంది వకుళ.

వకుళ మనస్సు ఏడుస్తూంది.

కళ్ళు ఏడ్చి ఏడ్చి అలసిపోయాయి. అసని పోతున్నా... కళ్ళల్లో తడి చూస్తే అరవింద్ ఆమెను మరలా గోడకేసి ఫుట్‌బాల్ ఆడేస్తాడు.

అరవింద్ ఏమీ తెలియని వాడు కాదు.

అన్నీ తెలిసిన వాడే... కాని అతని మనస్తత్వం అంతే!



వకోడీలు చేసేటప్పుడు - శనగ పిండి, బియ్యపు పిండికి తోడుగా వేయించిన శనగ పప్పు (వేరుశనగ పప్పు కాదు) పొడిని కూడా కలిపి చూడండి. పకోడీల టేస్టులో ఎంత మార్పు ఉంటుందో, ఎంత నోరూరేలా ఉంటాయో మీరే గమనించగలరు.

మూర్ఖులను రంజింప జేయ శక్తి లేని వకుళ-అతని చేతిలో మైనం ముద్ద. అతను ఎలా వంచితే అలా వంగుతుంది.

అందరూ కళ్ళతో ఏడిస్తే... ఆమె మనస్సు మౌనంగా రోదిస్తుంది.

బెడ్రూములోకి వకుళను ఒక తోపు తోసి తనూ దూరి తలుపు బిగించాడు.

రాఘవరావు హృదయం తూట్లు పొడిచినట్లయింది.

అతను ఆడపిల్లను కన్న తండ్రి.

ఆ బిడ్డను మరో మగవాడి చేతిలో పెట్టిన తర్వాత అతనికి ఆ బిడ్డ మీద గల స్వతంత్రత, చొరవ, చనువు-అన్నీ ముగిసిపోతాయి.

అతను కేవలం ఆమె జీవితానికి ప్రేక్షకుడు మాత్రమే! సూత్రధారి కాలేడు.

మర్రోజుదయం-ఏడ్చి ఎరుపెక్కిన కనులను తండ్రి దగ్గర దాచుకుంది వకుళ.

రాఘవరావు తెచ్చిన డబ్బు విషయాన్ని గూర్చి-అరవింద్ ఆఫీసుకి వెళ్ళిన పిదప-ఆమెను కదిపాడు.

దాన్ని వకుళ పేర బ్యాంకిలో వేయాలని అతనుద్దేశం. కాని అందుకు వకుళ అంగీకరించలేదు.

"అతను నిన్ను ఎలా బాధించినా బాధించనీ నాన్నా! నేను మాత్రం అతడిని మోసం చేయలేను. నా పేర వేయవద్దు. అతనికే యిచ్చివేయండి. వుంటే తింటాము. లేకుంటే పస్తుంటాము" నిర్మొహమాటంగా చెప్పేసింది.

క్రితం రాత్రి వకుళను అరవింద్ బాధించిన విషయం గుర్తుకొచ్చి-రాఘవరావు మొట్టమొదటి సారిగా వకుళకి తననుండి సంక్రమించిన సాంప్రదాయాన్ని దుయ్యబట్టాడు.

వకుళ డబ్బు వకుళకి అందించేశాడు.

ఆముక్త డబ్బు కూడా వకుళకే వాడాలని అంత క్రితం అతను తీసికొన్న నిర్ణయాన్ని వెనక్కి తీసికొని-ఆముక్త బిడ్డల పేరు మీద బ్యాంకులో వేయాలన్న నిర్ణయానికివచ్చాడు

వకుళ కోసం-బాగుపడని ఓ సంసారం కోసం సహాయం చేయడం అనుచితం. అందుకే ఆ నిర్ణయానికి కొచ్చాడు.

తాను ప్రత్యేకంగా వకుళ కోసం వెదకి, వెదకి ఎన్నిక చేసిన సంప్రదాయం. వంశం-కులం-అన్నీ కలసి కట్టుగా రాఘవరావుని ఎద్దేవా చేశాయి.

కులం లేని-

సంప్రదాయమయిన వంశమూ కాని-

ఏదీ లేని ఆముక్త, అరుణ్‌ల అందమయిన కాపురం అతడిలో ఆనందాన్ని గుమ్మరించింది.

సకలమూ తెల్సిన రాఘవరావు-చదువుకొన్న రాఘవరావు-సంస్కారమెరిగిన రాఘవరావు-కులం కోసం తానెందుకు అంత ప్రత్యేక శ్రద్ధ చూపాడో... అతనికే అర్థం కాలేదు.

అంటరానికులం-అరుణ్‌ది. ఇది మనుషులచే స్వార్థంతో కల్పించబడిన కులవ్యవస్థ-!

అంటరాని గుణం-అరవింద్‌ది. ఇది మనస్సు యొక్క నైజం. వ్యక్తి అహంకారంతో, పొగరుతో తనకై తానే స్వయంగా ఏర్పరచుకొన్న గుణం!

కాలమేదయినా నేమి?

దేశమేదయినానేమి? కులమేదయినా నేమి! మనుషుల్లో వుండే రకాలు రెండే 'మంచి-చెడు' అన్నది రాఘవరావు మేధస్సుకి అర్థమయింది.

"సారే జహాసే అచ్చా హిందూస్థాన్ హమారా

హమ్ బుల్ బుల్ హై ఇస్ కీ యహ్ గులిస్త హమారా" ఎక్కడో టేప్ రికార్డరులో పాట విన్పించింది రాఘవరావుకి. దానితో పాటు దాని అర్థం అతని మనస్సులో మెదలింది.

"మనము బుల్ బుల్ పక్షులవంటి వారము. ఇది మన తోట. మతము వైరము నేర్పదు. హిందూ దేశం మనది. హిందూ దేశీయులం మనం."

గుణమన్నది కులాన్ని బట్టి, మతాన్ని బట్టి-అంతస్థుని బట్టి మారదన్నది-అది వ్యక్తిగతమన్నది-అందుకని మనుషులను కులాల ప్రాతిపదికలో విభజించడం చాలా తెలివి తక్కువ తనం-అన్నది రాఘవరావుకి చక్కగా అర్థమయింది. ☐